## శ్రీరామరక్ష

మొదటి పేజీ తొరవ

అభిమానం ఏర్పడుతున్నందువల్ల కాదీ మార్పు; కాంగ్రెస్ ఎమ్మెల్యేల పట్ల ఈ రెండేళ్లలో కల్గిన ఏహ్యభావం అందుకు కారణం.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సామంతు రాజులుగా తయారుచేశాడు రాజశేఖరరెడ్డి గారు. అడగని వాడు పాపాత్ముడు అన్నట్లుగా వారు కోరిన పనులన్నీ చేసి పెట్టాడు. వారి వారి నియోజక వర్గాలలో ప్రభుత్వ, పార్టీ వ్యవహారాలు రెండింటినీ వారికే దఖలు పరిచాడు. పోలీసు కానిస్టేబుల్ నుంచి ఎమ్మార్వో వరకు ఎమ్మెల్యే చెప్పిన వాడికే పోస్టింగ్; ఎమ్మెల్యే కాదంటే బదలీ. ఈ అవకాశాన్ని నూటికి తొంభై మంది ఎమ్మెల్యేలు దుర్వినియోగం చేస్తున్నారు. అవినీతి, అరాచకత్వం, అవధులు మీరిన అహంకారాలతో వారు భ్రష్టు పట్టడమే కాక, పార్టీని కూడా ఇబ్బంది పెడుతున్నారు. ఎమ్మెల్యేల వైఖరితో కాంగ్రెస్ కార్యకర్తలు విసిగిపోయి వున్నారు. విరక్తి చెంది వున్నారు. ఈ ఎన్నికలలో ఈ ప్రభావం విస్తృతంగా కన్పించబోతున్నది. కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికలలో చురుకుగా పాల్గొనక పోవడమే కాదు, కొన్ని చోట్ల ఎమ్మెల్యేలు నిలబెట్టిన అభ్యర్థులకు వ్యతిరేకంగా కూడా పని చేస్తున్నారు.

అభ్యర్థుల ఎంపికలో కూడా ఎమ్మెల్యేలు పార్టీ విధేయతల కంటే, తమకు ఆర్థికంగా లాభం చేకూర్చే వారినే ఎంపిక చేశారన్న ఆరోపణ సర్వత్రా విన్పడుతున్నది. చాలా చోట్ల ఎమ్మెల్యేలు ఎమ్పీటీసి, జడ్పీటీసి టిక్కెట్లు అమ్మకానికి పెట్టారు. ఒక్కొక్క జడ్పీటీసి స్థానాన్ని మూడు నుంచి ఐదు లక్షల వరకు అమ్ముకున్నారని జిల్లాల నుంచి వార్తలందుతున్నాయి. ఇటువంటి అపభ్రంశపు పనులు స్థానికంగా కార్యకర్తల మీద తీవ్రమైన ప్రభావం చూపుతాయనడం వాస్తవం.

ఒక్క మాటలో చెప్పాలంటే, తెలుగుదేశం పార్టీని తిరిగి బ్రతికించడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తున్నారనడం నిజం.

సిపిఎంతో పొత్తు కుదరడం కూడా ఆ పార్టీకి వెయ్యేనుగుల బలం సమకూర్చింది. వారివల్ల ఎన్ని ఓట్లు వస్తాయి అనే మీమాంస కంటే, కార్యకర్తల పరంగా ఎంతో సహకారం అందుతుంది. ఏ కార్యక్రమం ప్రకటించినా సిపిఎం కార్యకర్తలు ఎర్ర జెండా పట్టుకుని రోడ్లో నిలబడి పోతున్నారు కాబట్టి, వారి కోసమైనా తెలుగుదేశం కార్యకర్తలు బయటకు రాక తప్పడం లేదు. కాంగ్రెస్‌కు, తెలుగుదేశానికి తేడా స్వల్పంగా వుండే చోట్ల సిపిఎం ఓట్లు ఎంతో వుపకరిస్తాయనడంలో సందేహం లేదు.

ఈ రెండు కారణాల వల్ల చచ్చిపోయిన పాము బ్రతికినట్లుగా తెలుగుదేశం పార్టీ కొత్త జవసత్వాలు సమకూర్చుకోగలుగుతున్నది. విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, ఖమ్మం, నల్గొండ వంటి జిల్లాలలో ఆ పార్టీకి చెప్పుకోదగిన స్థాయిలో జడ్పీటీసి సభ్యత్వాలు లభించే అవకాశం వుందని చెప్తున్నారు. ఏమీ లేకపోవడం కంటే ఇత్తడి పోగు వుండడం గొప్ప అన్నట్లు, ఏ జిల్లాలో కూడా సింగిల్ డిజిట్ దాటి జడ్పీటీసీలు, మండలాలు గెలుచుకునే అవకాశం లేదనే అభిప్రాయం వున్నప్పుడు, ఆరేడు జిల్లాలలో కాంగ్రెస్‌తో సమంగా స్థానాలు గెలుచుకునే అవకాశం ఏర్పడడం తెలుగుదేశం పార్టీకి మహదానందం కల్గించే విషయమే. చంద్రబాబు నుంచి కొంత సహకారం అందితే ఈ జిల్లాలలో తెలుగుదేశం జిప చైర్మన్ పదవులు స్వంతం చేసుకున్నా ఆశ్చర్యం వుండదని చెప్తున్నారు.

## నామరూపాలు

మొదటి పేజీ తొరవ

అభ్యర్థులకు డబ్బు లోటు లేకుండా చేయడానికి ముఖ్యమంత్రి తీసుకున్న జాగ్రత్తలు రాజకీయవాదులందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. సాధారణంగా ముఖ్యమంత్రులు ఎన్నికల సమయంలో అభ్యర్థులకు నామమాత్రంగా మాత్రమే డబ్బు సమకూరుస్తూ వుంటారు. ఎన్నికల ఖర్చు భారం మంత్రుల మీద మోపుతూ వుంటారు. కానీ రాజశేఖరరెడ్డి గారు అటు మంత్రులను కానీ, ఇటు ఎమ్మెల్యేలను కానీ తమ జేబులలో నుంచి డబ్బు తీయమని చెప్పడం లేదు. ఏయే జిల్లాలకు ఎంత డబ్బు అవసరమో లెక్కగట్టి, తానే ఆ బాధ్యత తీసుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణ ముగియక మునుపే, 20తేది సాయంత్రానికి ముఖ్యమంత్రి నుంచి జిల్లాలన్నిటికీ డబ్బు సంచులు చేరిపోయాయి. ఒక్కొక్క జిల్లాలో తనకు నమ్మకస్తుడైన ఎమ్మెల్యే, లేదా మంత్రి ఇళ్లకు వాటిని చేర్పించి వేశారు. పక్కాగా, ఒక ప్రణాళిక ప్రకారం జరిగిపోయింది అది. స్థానిక సంస్థల ఎన్నికలకు ఇంతింత పెద్ద మొత్తాలు ముఖ్యమంత్రి నుంచి అందడం అనేది, చరిత్రలో జరగని విషయం. ప్రతి జిల్లాకు అథమ పక్షం నాలుగు కోట్ల రూపాయలు పంచిపెట్టాలన్నది ముఖ్యమంత్రి బడ్జెట్ అని చెప్తున్నారు. అందువల్ల ఏ అభ్యర్థి కూడా తనకు డబ్బు లేదు కాబట్టి ఇబ్బంది పడ్డాను అని చెప్పడానికి అవకాశమే లేదు.



నెల్లూరు చిన్నబజారులోని న్యూ రాజ్యలక్ష్మి హోటల్ మెగా షోరూంను ప్రారంభిస్తున్న మేయర్ పులిమి శైలజ, టివి యాంకర్ ఉదయభాను. ప్రక్కన షోరూం అధినేతలు బివిరమణయ్య, బిశ్రీనివాసులు, బివిరవికుమార్ తదితరులున్నారు.

అధికారుల నుంచి కూడా కాంగ్రెస్ అభ్యర్థులకు పూర్తి సహకారం అందేటట్లు చూస్తున్నాడు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీల మీద ఎమ్మెల్యేలు చిన్న ఫిర్యాదు చేసినా, వెంటనే వారికి కఠిన హెచ్చరికలు వెళ్లిపోతున్నాయి.

అన్ని జాగ్రత్తలు తీసుకుంటే, ప్రజలలో వున్న మోజును వాడుకుంటే, తెలుగుదేశం పార్టీ ఏ జిల్లాలోను సింగిల్ డిజిట్ దాటకుండా చూడవచ్చునన్నది ముఖ్యమంత్రి ఆలోచన. తొంభై శాతం మండలాలు, మొత్తం 22 జిపలు కాంగ్రెస్ పరం కావడం అంటూ జరిగితే, ఇక రాష్ట్రంలో తెలుగుదేశం ఒక పార్టీగా మిగిలే పరిస్థితి వుండదని; దాని కార్యకర్తలంతా గ్రామ స్థాయిలో కాంగ్రెస్‌కు వలస వచ్చేస్తారని; అది సాధించగలిగితే రేపటి అసెంబ్లీ ఎన్నికలలో ఎదురు వుండదని ఆయన తలపోస్తున్నాడు.



